క్లుప్తంగా

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 3, 4, 8, 9వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి సంబంధించి, అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డి.భారతి ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. 3వ తరగతిలో 80 సీట్లకు గాను ఎస్టీ సవరకు 34 సీట్లు, ఎస్టీ గదబకు 25, ఎస్సీకి 02, బీసీకి 01, ఓసీకి 01, ఎంప్లాయీ కోటాకి 01, దివ్యాంగుల కోటా కింద 02, కొండదొరలకు 01, ఓపెన్ ఫర్ ఆల్(పీటీజీఎస్) సవర, గదబలకు 13 చొప్పున కేటాయించడం జరిగిందన్నారు. 4వ తరగతిలో 5 సీట్లు, 8వ తరగతిలో 1, 9వ తరగతిలో 1 సీటు ఖాళీగా ఉందన్నారు. జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదివి, కుటుంబ వార్షిక ఆదాయం ఏడాదికి రూ.లక్షకుమించి ఉండని వారు ఈ పాఠశాలలో చేరేందుకు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న విద్యా ర్థులు ఈ నెల 20వ తేదీలోగా పాఠశాలకు నేరుగా వచ్చి, దరఖాస్తులు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 9381077363, 9490957218ను సంప్రదించాలని కోరారు.

నిర్భయంగా ఓటు వేయండి



పరజపాడులో ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చిన్నంనాయుడు

జియ్యమ్మవలస: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలని చినమేరంగి ఎస్‌ఐ చిన్నంనాయుడు కోరారు. మండలంలోని పరజపాడు గ్రామంలో ఎన్నికల నిబంధనలు, ఓటుహక్కు వినియోగంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రతిఒక్కరూ నిజాయితీగా తమకు నచ్చిన వ్యక్తికి ఓటు వేసుకోవాలని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా సమాచారం ఇవ్వాలన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పరిశీలన

రాజాం: స్థానిక పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వైఎస్సార్ సీపీ విజయనగరం ఎంపీ అభ్యర్థి, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్‌లు పరిశీలించారు. ఓటింగ్ జరుగుతున్న తీరును ఏజెంట్లను అడిగి తెలుసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటింగ్ జరిగేలా చూడాలని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా ఎన్నికల అధికారులు, పోలీసులకు తెలపాలని ఎంపీ సూచించారు.

ఎమ్మెల్సీ పరామర్శ

రేగిడి: మండలంలోని దేవుదళ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు కెంబూరి శ్రీహరిరావునాయుడుని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆదివారం కలిసి, పరామర్శించారు. అనారోగ్యం కారణంగా పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన శ్రీహరిరావునాయుడు ఇంటి వద్దనే కోలుకుంటున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆయన దగ్గరకు వెళ్లి, ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకోవాలని, ఎప్పటిలాగే పార్టీ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని ఎమ్మెల్సీ కోరారు.

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలి

రేగిడి: విద్యార్థి దశ నుంచే ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలని మండలంలోని అంబఖండి గ్రామానికి చెందిన ఆధ్యాత్మిక వక్త తోట అరుణకుమారి తెలిపారు. స్థానిక విశ్వసాయి మందిరంలో ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె.. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను వివరించడంతో పాటు ప్రార్థనా శ్లోకాలు, రామాయణ, మహాభారతంలోని ముఖ్య అంశాలు తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది మామిడి వేణుగోపాలనాయుడు, భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి

సీఎంను చేసుకుందాం..

- వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమం, అభివృద్ధి
- కూటమి హామీలు బూటకం
- ఇంటింటి ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే కళావతి



పెద్దదిమిలిలో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే కళావతి

భామిని: సంక్షేమం, అభివృద్ధి నిరంతరం కొనసాగాలన్నా.. నవరత్న పథకాలు ఇంటి వద్దకే రావాలన్నా.. మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని పాలకొండ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని పెద్దదిమిలి, పోలీస్‌కోట, పోలవరం, జక్కరగూడ, చింతలగూడ, చిన్నదిమిలి, కొరమ గ్రామాల్లో ఆదివారం విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో అందించిన సంక్షేమ, అభివృద్ధి ఫలాలను వివరించారు. నమూనా ఈవీఎంను చూపిస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోలోని అంశాలను వివరించారు. 2014 ఎన్నికల మేనిఫెస్టోను అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా చంద్రబాబు ప్రజలను మోసం చేశారని, మళ్లీ ఇప్పుడు అవే హామీలతో ప్రజలను మోసం చేసేందుకు మరోసారి వస్తున్నారని విమర్శించారు. టీడీపీ మేనిఫెస్టో చూసి మోసపోవద్దని అన్నారు. ప్రతీ గడప వద్ద మహిళలు ఆమెకు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. నవరత్న పథకాలతో తామంతా లబ్ధిపొందామని మహిళలు ఎమ్మెల్యే కళావతితో తమ సంతోషాన్ని పంచుకున్నారు. పోలవరంలో ఆదివాసీ గిరిజనులు సాంప్రదాయ దింసా నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బుయ్యాల జయరాం, సర్పంచ్‌లు తొగరాన శ్రీను, బిడ్డిక నారాయణ, లోతుగెడ్డ రవికుమార్, అగతముడి నీలవేణిల సారథ్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తోట సింహాచలం, కొవ్వాడ చిరంజీవులు, బోనగడ్డి ధర్మారావు, మజ్జి మోహనబాబు, అగతముడి రఘు, టంకాల శ్రీను, షణ్ముఖరావు, పిరపక శ్రీను, బొడ్డేపల్లి ప్రసాద్, వందలాది మంది కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



భామిని: పోలీస్‌కోటలో దివ్యాంగుని యోగ క్షేమాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కళావతి



దింసా నృత్యాలతో ఎమ్మెల్యే కళావతికి ఘనస్వాగతం

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

సీతంపేట: మండలంలోని నాయుడుమల్లి గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంతం ప్రభోద సేవాసమితి, హిందూ జ్ఞాన వేదిక శ్రీకాకుళం కమిటీ ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం చేశారు. త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ప్రభోదానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సంతోష్, కుమార్, అనంతగిరి, ఈశ్వర్, బాలు, వెంకటరావు, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.



త్రైత సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

భానుడి భగభగలు

పాలకొండ రూరల్: పగటి ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరుకోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉదయం 9 గంటలు దాటిన తరువాత ఇంటి నుంచి బయటకు రావాలంటే హడలిపోతున్నారు. ఆదివారం 44 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రత నమోదు కావడంతో పాటు వేడి గాలులు వీయడంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే పాలకొండ–శ్రీకాకుళం, విశాఖ, సీతంపేట రహదారులతో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు, వీధులు ఖాళీగా కనిపించాయి. ఉష్ణోగ్రతలు పెరగడంతో అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక ఎస్సై జామి సర్వేశ్వరరావు సూచించారు.



నిర్మానుష్యంగా మారిన పాలకొండ-విశాఖ రహదారి

వీరఘట్టంలో విస్తృత ప్రచారం

వీరఘట్టం: వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి, అరుకు ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజారాణి గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు మండలంలో విస్తృత ప్రచారం చేస్తున్నాయి. ఇందులో భాగంగా స్థానిక సర్పంచ్ పులిటి గౌరమ్మ, పార్టీ పట్టణ అధ్యక్షులు దిబ్బ లలితకుమారి, పిన్నింటి శ్రీను, మంతిని హేమలత, బొమ్మాలి హేమలత, శంభాన శ్రీను, వుగిరి శ్రీను, తదితరులు ఆదివారం వీరఘట్టం పంచాయతీలోని అన్ని వీధుల్లో ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఎమ్మెల్యే కళావతి పెద్దక్క అరంజ్యోతి కుటుంబ సభ్యులతో కలిసి పలు వీధుల్లో ప్రచారం చేశారు.



లెంకవీధిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సీబీఎం వీధిలో ప్రచారంలో భాగంగా జై జగన్ నినాదాలు చేస్తున్న మహిళలు

నేడు ఎమ్మెల్యే కళావతి ప్రచారం

భామిని: మండలంలోని ఘనసర, సతివాడ, కీసర, కోసలి గ్రామాల్లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సోమవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని ఎంపీపీ తోట శాంతికుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం ఆదివారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

తాగునీటిని వృథా చేయొద్దు



ఉనుకూరులో తాగునీటి కుళాయిలను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్

రేగిడి: తాగునీటిని వృథా చేయవద్దని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీచరణ్ ప్రజలను కోరారు. మండలంలోని ఉనుకూరు, చిన్నశిర్లాం, పెద్దశిర్లాం తదితర గ్రామాల్లో ఆదివారం పర్యటించిన ఆయన.. తాగునీటి కుళాయిల పనితీరును, వినియోగాన్ని పరిశీలించారు. అనంతరం నీటిని పొదుపు వాడడంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. రానున్న వేసవిల్లో నీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు నీటి పొదుపు చాలా అవసరమన్నారు. అలాగే పలుచోట్ల మరమ్మతులకు గురైన తాగునీటి పైపులైన్లను బాగుచేయించారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ గోపాలరావు

లక్కవరపుకోట: ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్‌ఐ ఆర్.గోపాలరావు అన్నారు. ఎన్నికల కోడ్‌పై మండ లంలోని దాసుళ్లపాలెం గ్రామస్తులకు ఆదివారం రాత్రి అవగాహన కల్పించారు. ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా గొడవలు సృష్టిస్తే కేసులు నమోదు చేస్తామని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా నడుచుకోవాల ని చెప్పారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

చంద్రబాబు మాటలు నమ్మొద్దు

- వైఎస్సార్ సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: టీడీపీ అధినేత చంద్రబాబువి మాయ మాటలు అని, ఆయన మాటలు నమ్మవద్దని వైఎస్సార్ సీపీ కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కొత్తూరు, శివ్వాం, గొట్టివలస, గొల్లవానివలస, తులసిరామినాయుడువలస, ఉల్లిభద్ర గ్రామాల్లో ఆదివారం పర్యటించిన ఆమెకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె.. ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగించారని, ఆయన పాలనలో అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. పేదల అభ్యున్నతే ప్రధానంగా ఆయన అమలు చేసిన పథకాలతో ఎంతోమంది జీవితాల్లో సంక్షేమ వెలుగులు నెలకొన్నాయన్నారు. అధికారం కోసం ఎన్నికలు వచ్చినప్పుడల్లా మోసపూరిత హామీలతో ప్రజలను మాయ చేసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తుంటారని, ఆయనను నమ్మితే రాష్ట్ర ప్రజల భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. జగనన్నతోనే రాష్ట్రానికి, రాష్ట్రంలోని ప్రజలకు మేలు జరుగుతుందని, రానున్న ఎన్నికల్లోనూ ఆయనకే మన సంపూర్ణ మద్దతు తెలిపి, ఆశీర్వదించాలని అభ్యర్థించారు. ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేసి, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తనను, ఎంపీగా బరిలో ఉన్న తనూజారాణిని అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, వైద్యుడు ద్వారపురెడ్డి రామ్మోహనరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు ద్వారపురెడ్డి రజని, శెట్టి దివ్యలక్ష్మి, ఎంపీటీసీలు గుంట్రెడ్డి అన్నపూర్ణమ్మ, గుంట్రెడ్డి శంకరరావు, బోను చంద్రశేఖరరావు, బొంగు గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.



శివ్వాం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

విజయమే లక్ష్యంగా పనిచేయాలి

పాలకొండ రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్ అన్నారు. మండలంలోని పార్టీ నాయకులతో ఆదివారం సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గరపడుతున్నందున క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతికి సంపూర్ణ మద్దతు తెలిపేందుకు కార్యకర్తలంతా ప్రచారంలో పాల్గొనాలని కోరారు. కళావతమ్మ హ్యాట్రిక్ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై టీడీపీ దుష్ప్రచారం

- ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్



వీరఘట్టం: టీడీపీ నేత చంద్రబాబునాయుడుకు ఓటమి భయం పట్టుకుందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మొన్నటికి మొన్న వలంటీర్లను సంఘ విద్రోహశక్తులంటూ తప్పుడు ప్రచారాలు చేశారు. తర్వాత వలంటీర్ల ద్వారా వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేయకుండా ఎన్నికల కమిషన్‌కు తప్పుడు ఫిర్యాదు చేయించారు. తాజాగా ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై దుష్ప్రచారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురుచేస్తున్నారని అన్నారు. ఆదివారం వీరఘట్టం వచ్చిన ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో మన భూములకు మరింత రక్షణ ఉంటుందన్నారు. భావి తరాలకు వివాద రహిత భూమిని అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని అన్నారు. టీడీపీ హయాంలో ప్రజల నుంచి దోచుకున్న భూముల బండారం బయటపడుతుందనే భయంతోనే చంద్రబాబు అండ్ కో పచ్చమీడియాతో కలిసి ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై రాద్ధాంతం చేస్తున్నారని మండిపడ్డారు. వాస్తవానికి మూడేళ్ల క్రితమే ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించి అన్ని రాష్ట్రాలకు మార్గదర్శకాలను నిర్దేశించిందని తెలిపారు. భూముల రీసర్వే పూర్తయితేనే ఈ చట్టం అమలవుతుందన్నారు. దేశంలో బ్రిటిష్ కాలంలో చేపట్టిన భూసర్వే తప్ప ఇప్పటివరకు ఏ ప్రభుత్వమూ భూసర్వే చేపట్టలేదన్నారు. గత మూడేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులు, ప్రజల సమక్షంలోనే రీసర్వే చేపడుతోందన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే వాటిని పరిష్కరిస్తూ రీసర్వేని విజయవంతంగా నిర్వహిస్తోందన్నారు. రీసర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతున్నప్పటికీ టీడీపీ మాత్రం రాజకీయ కక్షతో తప్పుడు ప్రచారాలు చేస్తోందన్నారు. వారికి పచ్చమీడియా తోడై ఈ తప్పుడు ప్రచారాన్ని విస్తృతం చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ఐవీఆర్‌ఎస్ ఫోన్ కాల్స్ ద్వారా నేరుగా ప్రజలను భయభ్రాంతులకు గురుచేస్తుండడంపై ఎన్నికల కమిషన్ దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ విక్రాంత్ కోరారు.

వైఎస్సార్ సీపీకి పట్టం కట్టండి

- వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

జియ్యమ్మవలస: రానున్న ఎన్నికల్లోనూ మళ్లీ ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలని వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని బాసంగి పంచాయతీ పరిధిలో ఉన్న బాసంగి, ఎం.హరిపురం, బాసంగి గదబవలస గ్రామాల్లో ఆదివారం పర్యటించిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ఈ ఐదేళ్లలో ప్రజలకు ప్రభుత్వం చేసిన మేలును వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని, ఆ దిశగానే ఆయన ఐదేళ్ల పాలన కొనసాగించారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతానికి పైగా హామీలతో పాటు సభలు, సమావేశాలు, సదస్సుల్లో ప్రజలకు ఇచ్చిన మరెన్నో హామీలు నెరవేర్చారన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచిన గొప్ప నాయకుడు జగనన్న అని ప్రశంసించారు. ఆయనకు మనమంతా అండగా నిలవాలని, ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు రెండూ ఫ్యాన్ గుర్తుకే వేయాలని కోరారు.



బాసంగిలో ఎన్నికల ప్రచారంలో పార్టీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

పాలకొండ: నియోజకవర్గ కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్‌కుమార్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శుభం బన్సల్ పోలింగ్ సరళిని పరిశీలించారు. నియోజకవర్గం మొత్తంలో 2,462 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వారిలో 935 మంది ఇతర నియోజకవర్గాల్లో ఓటు వేయాల్సి ఉండగా, ఈ నియోజకవర్గంలో 1,527మంది ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంది. మొదటి రోజున 725 మంది బ్యాలెట్ ఓటింగ్‌లో పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్ తీరును పరిశీలించారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కురుపాం: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రశాంతంగా జరిగిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.వి.రమణ తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,241 మంది పోస్టల్ బ్యాలెట్ కలిగిన వారుండగా, వారిలో 910 మంది తొలిరోజు తమ ఓటును వినియోగించుకున్నారన్నారు. మిగతా వారంతా తమ పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఓటింగ్ జరుగుతున్న తీరు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కళావతి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలన చేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్



హెల్ప్ డెస్క్ వద్ద సూచనలు చేస్తున్న ఆర్వో శుభం బన్సల్



ఓటు హక్కును వినియోగించుకున్న ఉద్యోగులు